



శ్రీకాకుళం ఆర్కే నగర్‌కాలనీలో టీవీలో మ్యాచ్ తిలకిస్తున్న అభిమానులు

క్రికెట్ సందడి

- ఉత్కంఠగా భారత్-న్యూజిలాండ్ చాంపియన్ ట్రోఫీ ఫైనల్
- భారీ స్క్రీన్‌లు, టీవీల్లో తిలకించిన అభిమానులు

శ్రీకాకుళం స్పోర్ట్స్/ నరసన్నపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):

భారత్- న్యూజిలాండ్ జట్ల మధ్య ఆదివారం క్రికెట్ చాంపియన్ ట్రోఫీ ఫైనల్ జరగ్గా.. జిల్లా అంతటా సంద డి నెలకొంది. యువకులు, క్రికెట్ అభిమానులు భారీ స్క్రీన్‌లు, టీవీలు, సెల్‌ఫోన్లలో మ్యాచ్‌ను తిలకించారు. నర సన్నపేటలోని జూనియర్ కళాశాల మైదానంలో యంగ్ మాస్టర్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. క్రికెట్ అభిమానులు కళాశాల మైదా నంలో కూర్చొని.. ఫైనల్ పోరును తిల కించారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజి లాండ్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. అనంతరం భారత్ జట్టు బ్యాటింగ్‌కు దిగగా అభిమానులు ఉత్సా హంతో వీక్షించారు. పోరు ఉత్కంఠగా సాగింది. భారత్ ఆరు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించడంతో క్రికెట్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కాగా.. క్రికెట్ ఫైనల్ పోరు నేపథ్యంలో అందరూ ఇళ్లకే పరిమితమవ డంతో ఆదివారం మధ్యా హ్నం శ్రీకాకుళం నగరంలోని సూర్యమహాల్ జంక్షన్,



నరసన్నపేటలోని కళాశాల మైదానంలో భారీ స్క్రీన్‌పై మ్యాచ్‌ను తిలకిస్తున్న క్రికెట్ అభిమానులు

ఏడురోడ్ల కూడలి, అరసవల్లి జంక్షన్ తదితర ప్రాంతాల్లో నిర్మానుష్యంగా కనిపించాయి.





ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో సూర్యమహాల్ జంక్షన్ వద్ద నిర్మానుష్యం

భారత్ విజయం గర్వకారణం

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉత్కంఠ భరిత పోరులో విజయం సాధించి.. కోట్లాది మంది భారతీయులకు గర్వకారణంగా నిలిచిన భారత క్రికెట్ జట్టుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. చాంపియన్స్ ట్రోఫీని గెలిచిన టీమ్ ఇండియాకు శుభాకాంక్షలు చెప్పారు. పోరాట పటిమ, జట్టు సభ్యులు కనబరిచిన ప్రతిభ యావత్ ప్రపంచంలోని క్రీడా ప్రేమికులను అలరించిందని తెలిపారు.

యంత్రాలు వస్తున్నాయ్..

- ఐదేళ్ల తర్వాత వ్యవసాయ పరికరాల పంపిణీకి సన్నాహాలు
- జిల్లాలో 1,903మంది రైతులకు రూ.2.86 కోట్ల రాయితీ

టెక్కలి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని రైతులు ఎదురుచూస్తున్న వ్యవసాయ యంత్రాల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. వైసీపీ ప్రభుత్వ పాలనలో గత ఐదేళ్లు రైతులకు యాంత్రీకరణ పరికరాలు అందలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై యాంత్రీకరణ సామగ్రి అందించేందుకు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా జిల్లాలోని 1,903 మంది రైతులకు రూ.2,86, 91,000 రాయితీతో యాంత్రీకరణ పరికరాలు అందించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. సబ్‌మిషన్ ఫర్ అగ్రికల్చర్ మిషనరీ (ఎస్‌ఏఎంఏ) పథకం ద్వారా ఈ పరికరాలు అందించేందుకు ఇప్పటికే మండల స్థాయిలో వ్యవసాయశాఖ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ పథకానికి సంబంధించి గత ఆరు సీజన్లలో ఈ-క్రాప్‌లో నమోదైన సన్న, చిన్నకారు రైతులను అర్హులుగా గుర్తించారు. అలాగే ఒక్కో రైతు కుటుంబానికి ఒక్కో పరికరం మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. గతంలో కష్టమ్ హైయిరింగ్ సెంటర్ల ద్వారా సామగ్రి తీసుకున్న రైతులకు ఈసారి అవకాశం తప్పించనున్నారు.



వ్యవసాయ యాంత్రీకరణ పరికరం

- జిల్లాలో రైతులకు 600 స్ప్రేయర్లు, 500 పవర్ స్ప్రేయర్లు, 730 రకరకాల ట్రాక్టర్ పనిముట్లు, 30 రోటావేటర్లు, 18 పవర్‌వీడర్లు, 15 పవర్‌టిల్లర్లు, పది బ్రష్ కట్టర్స్ 50 శాతం రాయితీపై అందజేయనున్నారు. సీడ్ కమ్ ఫెర్టిలైజర్స్ డ్రిల్, కల్టివేటర్, మినీకల్టివేటర్, కల్టివేటర్ స్ప్రింగ్, బోటమ్ ప్లగ్, డక్‌ఫుట్ కల్టివేటర్, లెవలింగ్ బ్లేడ్, ఆఫ్‌కేజీ వీల్, పవర్ స్ప్రేయర్లు, భూమ్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, హెచ్‌టీపీ స్ప్రేయర్లు, పోర్టబుల్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, (మిగతా 7వ పేజీలో..)

జిల్లా వైద్యఆరోగ్యశాఖపై విజిలెన్స్!

- గతంలో నియామకాల్లో అక్రమాలు?
- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కొంతమంది ఫిర్యాదు
- ఇప్పటికే వివరాలు సేకరించిన అధికారులు
- రిక్రూట్‌మెంట్ ఫైల్స్‌తో రావాలని 12 మందికి ఆదేశం



జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం

శ్రీకాకుళం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని నియామకాల్లో అక్రమాలపై విజిలెన్స్ దృష్టి సారించింది. మూడేళ్ల కిందట జిల్లా వైద్యఆరోగ్యశాఖలో ఆకాశరామన్నలు అత్యధికంగా ఉండేవారు. కొంతమంది అవినీతికి పాల్పడుతున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడం... దానిపై విచారణ చేయడం... ఫిర్యాదులో సంతకాలు తమవికాదని చెప్పడం వంటివి చోటుచేసుకున్నాయి. తాజాగా జిల్లా విజిలెన్స్ అధికారులకు మరో ఫిర్యాదు అందింది. '2014 నుంచి 2024 వరకు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో జరిగిన నియామకాల్లో భారీ అవినీతి చోటు చేసుకుంది. భారీగా డబ్బులు వసూళ్లు చేసుకుని పోస్టింగ్‌లు ఇచ్చారు' అని పూర్వపు డీఎంహెచ్‌ఓల పేర్లతో పాటు.. నియామక ప్రక్రియకు సంబంధించి ఫైల్స్ చూసే సిబ్బందిపైనా ఆరోపణలతో కూడిన ఫిర్యాదు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ విభాగానికి చేరింది. అందులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోనే పనిచేస్తున్న కొంతమంది సిబ్బం ది పేర్లతోనే ఫిర్యాదు ఉండటం విశేషం. కానీ అందులో సంత కాలు తమవికావని ఇప్పటికే కొంతమంది ఉన్నతాధికారుల విచారణలో స్పష్టంచేశారు. కాగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచి ఫిర్యాదు రాష్ట్రం నుంచి జిల్లాకు చేరడంతో తాజాగా అధికారులు పాత ఫైల్‌ను కదిపారు.

● 11 నుంచి విచారణ..

జిల్లా వైద్యఆరోగ్యశాఖలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న 12 మందికి జిల్లా విజిలెన్స్ ఎస్పీ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఇందులో నేరుగా డీఎంహెచ్‌వోకు లేఖ రాసి.. నోటీసును పంపారు. 'శ్రీకాకుళంలో రామలక్ష్మణ జంక్షన్ వద్ద ఉన్న (మిగతా 7వ పేజీలో..)

● హాజరవ్వాల్సింది వీరే..

జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్లు డి.సంతోష్, టి.సోమేశ్వరరావు, కేవీ నారాయణరావు, కె.ఆశాకుమారి, జి.వెంకటస్వామికి విజిలెన్స్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అలాగే జూనియర్ అసిస్టెంట్లు పి.దుర్గాప్రసాద్, పి.దుర్గాపండాదాస్‌తోపాటు ఎన్‌హెచ్ఎం డీఈవో పుక్కల ఆనంద్, ఎంపీహెచ్ఏ జి.వరాహనర్సింహ, ఆఫీస్ సూపరింటెండెంట్ డి.బాస్కర్ కుమార్, ఎంపీహెచ్‌ఈఓ సీహెచ్ వెంకటరావు, ఎన్‌హెచ్ఎం ఆఫీస్ అసిస్టెంట్ దుర్గారావు కూడా విచారణకు హాజరుకావాలని నోటీసులో స్పష్టం చేశారు.

నోటీసు ఇచ్చాం

జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బందిలో కొందరు హాజరుకావాలని నోటీసు ఇచ్చాం. మాకు అందిన ఫిర్యాదు మేరకు ఈనెల 11 నుంచి విచారణ నిర్వహిస్తాం. ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తాం.

- ప్రసాదరావు, జిల్లా విజిలెన్స్ అధికారి



శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్ భవనాలు

ఎప్పుడు కూలిపోతాయో..

- శిథిలావస్థలో ఎచ్చెర్ల పోలీసు క్వార్టర్స్
- బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న కుటుంబాలు
- కనీస వసతులు లేక అవస్థలు



ఓ ఇంట్లోకి ప్రవేశించిన నాగుపాము



విరిగిపోయిన కిటికీలు

శ్రీకాకుళం క్రైం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని పోలీస్ క్వార్టర్స్‌లో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితుల్లో.. కనీస వసతులు లేక పోలీసు కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. ఎచ్చెర్ల పోలీసుస్టేషన్ సిబ్బంది కోసం ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నిధులతో 2006లో ఈ క్వార్టర్స్ నిర్మించారు. 12 మంది పోలీసు కుటుంబాలు నివసించేలా భవనాలు నిర్మించగా.. అప్పటి డీజీపీ స్వర్ణజిత్‌సేన్ వాటిని ప్రారంభించారు. ప్రస్తుతం క్వార్టర్స్‌లో ఏడు కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి. చాలా భవనాలు కిటికీలు విరిగిపోయి, గోడలు బీటలు వారి.. శ్లాబు పెచ్చులూడిపోయి దర్శనమిస్తున్నాయి. బాత్‌రూమ్‌ల కిటికీలు, తలుపులు కూడా సరిగా లేవు. మరోవైపు గోడల్లో పైపులైన్లు లీకై నీరు కారుతోంది. దీంతో ఎప్పుడు ఏ పెచ్చు విరిగి.. ఎవరి మీద పడుతుందోనని అందులో నివసిస్తున్న వారు భయపడుతున్నారు. ఐదేళ్ల కిందట భవనాలకు రంగులేశారు కానీ, మరమ్మతులు చేపట్టలేదు. భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో దయనీయస్థితిలో జీవితాన్ని గడుపుతున్నారు. శ్రీకాకుళంలోని డీఎస్పీ కార్యాలయం వెనుక ఉన్న పోలీసుక్వార్టర్స్ కూడా శిథిలావస్థకు చేరుకోగా కొన్నేళ్ల కిందట కూల్చేశారు. అదే మాదిరి ఎచ్చెర్లలో కూడా క్వార్టర్స్‌ను కూల్చివేసి కొత్తవి నిర్మించాలని పోలీసు కుటుంబాలు కోరుతున్నాయి.

● జంతువులు, విషసర్పాల బెడద..

ఎచ్చెర్ల పోలీసుక్వార్టర్స్‌లో నివాసితులకు పాములు, అడవి పందుల బెడద వెంటాడుతోంది. పోలీసుస్టేషన్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు పెరిగిపోవడంతో విషసర్పాలు, జంతువులు తరచూ క్వార్టర్స్‌లోకి ప్రవేశిస్తున్నాయి. ఇటీవల ఓ కానిస్టేబుల్ ఇంట్లో పాము బుసలు కొడుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు భయాందోళన చెందారు. వేరొకరితో ఆ పామును పట్టించి.. దూరప్రాంతంలో విడిచి పెట్టేశారు. అలాగే ఇటీవల క్వార్టర్స్ వెనుక ఉన్న సెప్టిక్ ట్యాంక్ వద్ద ఓ అడవిపంది పిల్లలను పెట్టేసింది. అది ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందోనని భయాందోళన చెందారు. పిల్లలు కాస్త పెద్దవి కావడంతో అవి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో క్వార్టర్స్‌లో ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

● ప్రతిపాదనలు పంపాం..

ఎచ్చెర్లలోని పోలీసుక్వార్టర్స్‌లో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నట్టు గుర్తించాం. దీనిపై సంబంధిత అధికారులతో చర్చించాం. కొత్త క్వార్టర్స్ నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో కొత్త భవనాలు నిర్మిస్తాం.

-ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

సముద్రంలో యువకుడి గల్లంతు

8లో

- వత్సవలస యాత్రలో అపశ్రుతి
- నలుగురిని రక్షించిన పోలీసులు

ఇన్‌ఫ్లో రాక.. చుక్క నీరు లేక

7లో

- ఆందోళన చెందుతున్న రైతులు
- ఎడారిలా మారిన వంశధార నది



రణస్థలంలో ఆక్రమణల తొలగింపు

ఫ్లైఓవర్ పనుల ప్రారంభం

7లో

- కొలతలపై స్పష్టత
- రణస్థలం హైవేలో ఆక్రమణల తొలగింపు



ఆదిత్యాలయం ఆవరణలో భక్తులు..

ఆదిత్యాలయం.. భక్తజన సంద్రం

- కరుణించని కిరణ స్పర్శ



క్యూలో బారులుదీరిన భక్తులు

అరసవల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో ఆదిత్యాలయం భక్తజన సంద్రమైంది. ఓ వైపు ఆదివారం.. మరోవైపు ఆదిత్యుడి మూల విరాట్‌ను సూర్యకిరణాలు తాకనున్న నేపథ్యంలో ఉదయం 6 గంటలకే పెద్ద ఎత్తున భక్తులు అరసవల్లికి తరలివచ్చారు. క్యూలో బారులుదీరారు. కిరణాల తాకిడితో బంగారు వర్ణంలో మెరిసిపోనున్న ఆదిత్యుడ్ని దర్శించుకోవాలని భావించారు. కానీ ఆకాశంలో మబ్బుల కారణంగా కిరణాలు స్వామిని తాకలేదు. దీంతో భక్తులు నిరాశ చెందారు. అనంతరం స్వామిని దర్శించుకుని వెనుదిరిగారు. కొంతమంది భక్తులు ఇంద్రపుష్కరిణిలో స్నానాలు ఆచరించి రావిచెట్టు వద్ద పూజలు చేశారు. మరికొందరు క్షీరాన్నం వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. ఆదివారం ఒక్కరోజే ఆదిత్యుడికి రూ.8,54,950 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.5,97,800, విరాళాల ద్వారా రూ.91,525, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,65,635 వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు.

1,008 గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

శ్రీకాకుళంకల్చరల్, మార్చి9(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 1008 గ్రామాల్లో గ్రామసేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సమితి రాష్ట్రఅధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు తెలిపారు.ఆదివారం శ్రీకాకుళం లోని పెద్దమందిరంలో జిల్లా సత్యసాయిసేవా సంస్థల కన్వీనర్లు, జిల్లా పదాధికారులు యాక్టివ్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, పెద్దమందిరం నిర్మాణ కమిటీ చైర్మన్ అంధవరపు ప్రసాదరావు,కమలా త్రివేణి పుణ్యవతి,రమణబాబు, లింగ రాజు, పప్పల నాగేశ్వరరావు, అనాది గుప్త, శశికాంత్, శివ, బోయిన నరసింహ మూర్తి, కంభ మురళీకృష్ణ, అనురాధ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.10.60 కోట్లు మంజూరు

ఆమదాలవలస, మార్చి 9(ఆంధ్రజ్యోతి):పొందూరు మండలంలోని రోడ్ల నిర్మాణానికి రూ.పది కోట్ల 60 లక్షలు ప్రభుత్వం మంజూరుచేసినట్లు టీడీపీ కార్యాలయం వర్గాలు ఒక ప్రకటనలో ఆదివారం తెలియజేశాయి.ఉపాధి పథకంలో మంజూరైన నిధులతో తారురోడ్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నాయి.నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి బీసీ జనార్దనరెడ్డికి ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

రామయ్యపట్నం రోడ్డుకు రూ.కోటి 30 లక్షలు ..

సోంపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గొల్లగొండి కాలనీ నుంచి రామయ్యపట్నం వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.కోటి 30 లక్షలు కేటాయించారు.ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు టీడీపీనాయకులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గోపాల్, కోదండరావు, చంద్రయ్య, వెంకటరావు, భాస్కర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంపురం తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

ఎచ్చెర్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి):ఎస్ఎంపురానికి చెందిన తప్పటగుళ్ల కళాకారులు ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో జరుగుతున్న దక్షిణాది రాష్ట్రాల వివిధత్‌కా అమృత్ మహోత్సవ్‌లో ప్రదర్శన నిర్వహించారు. బృందానికి నాయకత్వం వహిస్తున్న కోరాడ సత్తిరాజును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు.

ఏరోబిక్ సభ్యులు మార్నింగ్ వాక్

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో ఆరేళ్ల కిందట ప్రారంభించిన కోడిరామూర్తి ఏరోబిక్ టీమ్ సభ్యులు ఆదివారం 12 కిలోమీటర్ల మేర మార్నింగ్‌చేశారు. ఉదయం ఐదు గంటలకు అరసవల్లి జంక్షన్‌లోని 80ఫీట్ రోడ్డువద్ద గల ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద నుంచి ప్రారంభించిన నడక రెండు గంటలపాటు కొత్తపేట, కిల్లిపాలేం మీదుగా గనగళ్లపేట బీచ్‌వరకుసాగింది. కార్యక్రమంలో సభ్యులు కరణం శ్రీనివాస్, కంచరాన ఉమామహేశ్వరరావు, హేమల రావు, రామచంద్రదేవ్, అప్పలరాజు, లక్ష్మణరావు, గోపి, రావు సురేష్, నాయుడు, రవి తదితర 40 మంది సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ఇచ్ఛాపురం,మార్చి 9(ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు కోరారు.ఆదివారం ఇచ్ఛాపురంలో పార్టీ జిల్లా కార్యదర్శి వల్లంపాటి కృష్ణప్రసాద్ అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం జరిగింది.కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయానంద్ రెడ్డి,అట్టాడ రవిబాబ్జీ, పూడి తిరుపతిరావు, బిర్లంగి ఉమామహే శ్వర రావు, గాంధీ, రాఘవరావు, పైడి వేణుగోపాల్, నిర్మలారెడ్డి పాల్గొన్నారు.

కేసులు ఉపసంహరించుకోవాలి

గుజరాతీపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):అన్నమయ్య జిల్లా రాయిచోటిలో ఇటీవల వీరభద్రస్వామిఆలయ పర్వేటి ఉత్సవం సందర్భంగా హిందువులపై రాళ్లతో దాడి చేయడాన్ని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కన్వీనర్ పి.సురేష్‌బాబు సింగ్ ఖండించారు.ఆదివారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ పోలీసులురక్షణ కల్పించకపోవడం దారుణమని, వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని, హిందువులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని కోరారు.

పిఠాపురం సభ విజయవంతం చేయాలి

సరుబుజ్జిలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 12న జరిగే సభను విజయవంతంచేయాలని జనసేన మండలాధ్యక్షుడు పైడి మురళీమోహన్ కోరారు.ఈ మేరకు ఆదివారం పట్టణంలోని పిఠాపురం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ్, సంఘంశెట్టి తేజేశ్వరరావు, పేడాడ రమణ, బొగ్గు అప్పలరాజు, గొల్లపల్లి శ్రీధర్, సతివాడ రామకృష్ణ పాల్గొన్నారు.

సుబలయలో 300 మందికి వైద్య పరీక్షలు


వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న బొడ్డేపల్లి సురేష్

అరసవల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): హిరమండలంలోని సుబలయలో శ్రీకాకుళానికిచెందిన వైద్యుడు,సంఘ సేవకుడు,శ్రీకాకుళం లయన్స్‌అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300మందికి ఈసీజీ, ల్యాబ్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రజలు మానసికఒత్తిళ్లకు దూరంగా ఉండాలన్నారు.బీపీ,షుగరు, పక్షవాతం, గుండెవ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు జీవీ రమణ, పీఎంపీ ఈశ్వరరావు, యువజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు.

ఎస్సీ, బీసీలకు పదవుల కేటాయింపులో ప్రాధాన్యం

శ్రీకాకుళం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీలుగా ఎంపికచేసిన కావలి గ్రీష్మ, బీద రవిచంద్ర, బీటీ నాయుడుకి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం రాత్రి ఒకప్రకటనలోశుభాకాంక్షలు తెలియజేశారు.ఎస్సీ, బీసీలకు పదవుల ప్రాధాన్యం ఇవ్వడంలో చంద్రబాబునాయుడు ఆదర్శంగా ఉంటారని పేర్కొన్నారు.

ట్రెజరీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం, మార్చి9(ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళంలోని జిల్లా ఖజానా కార్యాలయంలో ఆదివారంరాత్రి ట్రెజరీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక ఏపీటీఎస్ఏ నిబంధనల మేరకు నిర్వహించారు. జిల్లా ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.కిరణ్‌కుమార్,అసోసియేట్‌ప్రెసిడెంట్‌గా డి.శ్రీరామ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఐ.జ్యోతిలక్ష్మి, బి.ప్రదీప్‌కుమార్, ఎం.సాయిప్రసాద్, వై.కోటేశ్వరరావు, కార్యదర్శిగా ఎం.డేవిడ్, సంయుక్తకార్యదర్శులుగా పి.రమణమ్మ, పి.చంద్రశేఖర్, కె.నారాయణరావు, ట్రెజరర్‌గా కె.వరప్రసాద్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

గుజరాతీపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రాప్తికి పాత పెన్షన్‌విధానాన్ని వర్తింపజేసి న్యాయంచేయాలని ఏపీ డీఎస్సీ-2003 ఫోరం సభ్యులు డిమాండ్‌చేశారు. ఆదివారం శ్రీకాకుళంలో డీఎస్సీ-2003 ఫోరం సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పాతపెన్షన్ విధానాన్ని కొనసాగింపుపై ప్రభుత్వం స్పందించకపోతే త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. జిల్లా కన్వీనర్ పి.శ్రీహరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పి.శ్రీకర్, కె.ప్రకాష్, బి.శ్రీనివాసరావు, ఎ.లక్ష్మణరావునుకోకన్వీనర్లగా ఎన్నుకున్నారు.సమావేశంలో ఎస్.ఫల్గుణరావు, బుచ్చిబాబు,భాస్కరరావు, జి.చిన్నకృష్ణం నాయుడు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో టెక్‌ఫెస్ట్

ఎచ్చెర్ల, మార్చి9(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో మూడు రోజులుగా టెక్నీవర్స్ పేరిట నిర్వహిస్తున్న సాంకేతిక ఉత్సవ్(టెక్‌ఫెస్ట్) ఆదివారంముగిసింది.ఈసందర్భంగా దేశంలోని వివిధ ఐఐటీల నుంచి వచ్చిన ఆచార్యులు పలు సాంకేతిక అంశాలు, మారుతున్న సాంకేతిక అభివృద్ధిపై చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సెన్సార్, హైడ్రాలజీ, మెకానికల్ బిహేవియర్ ఆఫ్ హైటెంపరేచర్ అల్లాయ్స్, వీఎల్ఎస్ఐ పవర్ ఎలక్ట్రానిక్స్‌పై మాట్లాడారు.టెక్నీవర్స్‌లో డిపార్ట్‌మెంటల్ వర్క్‌షాపు, టెక్నికల్ క్విజ్ నిర్వహించి బహుమతులు ప్రదానంచేశారు.కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో మునిరామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, కెనరా బ్యాంకు లియో గ్లోబల్ ఓవరీస్, ట్రేడ్ మిలాన్, యూనియన్ బ్యాంకు, ఏటా ఎట్రా ఇన్నోవేషన్స్‌సంస్థల ప్రతినిధులు, ఎఆర్వో షణ్ముఖరావు పాల్గొన్నారు.

72 మందికి గ్రేడ్-4 కార్యదర్శులుగా పదోన్నతి

నరసన్నపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు, మేజర్ పంచాయతీల్లో పనిచేస్తున్న బిల్లు కలెక్టర్లకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో సీనియార్టీ ప్రాతిపదికన 72 మందికి పదోన్నతి కల్పి స్తూ జాబితాను సిద్ధం చేశారు. పదోన్నతిలో 70 శాతం గ్రేడ్-5 కార్యదర్శులకు, 30శాతం బిల్లు కలెక్టర్లుకు అవకాశం కల్పించారు. పదోన్నతి పొందిన అభ్యర్థులకు ఎంపీడీవోల ద్వారా సమాచారం ఇచ్చారు. ఆయా అభ్యర్థులకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఇన్‌ఫ్లో రాక..చుక్క నీరు లేక

● ఆందోళన చెందుతున్న రైతులు ● ఎడారిలా మారిన వంశధార నది

సరుబుజ్జిలి,మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వంశధార నదికి ఇన్‌ఫ్లో లేకపోవడంతో మార్చి మొదటి వారంలోనే ఎడారిని తలపిస్తోంది.ప్రస్తుతం చుక్కనీరు లేక పోవడంతో వేసవిలో తాగునీటికి అగచాట్లు తప్పవని పరివాహక ప్రాంత గ్రామస్థులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. వంశధార నది క్యాచ్‌మెంట్ ఏరియాలో గత ఏడాది నవంబరు, డిసెంబరులో వర్షాలు లేకపోవడంతో నదిలోకి ప్రవాహం తగ్గింది. దీంతో జనవరి, ఫిబ్రవరిలో పైనుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నది ఎడారిలా మారింది. నైరుతి రు తుపవనాల సమయంలో కురిసే వర్షం ఆధారంగా రబీలో ఆరుతడి పంటలు సాగుచేసేవారు. అయితే ఈ ఏడాది వర్షాలు అనుకూలించకపోయినా రబీలో వేరుశనగ,చెరకు, మొక్కజొన్న తదితర పంటలు సాగుచేశారు. సరుబుజ్జిలి మండలంలోని ఎల్‌పీఅగ్రహారం, పర్వతాలపేట, పాతపాడు,తెలికిపెంట, చిన్నకాగితాపల్లి, యరగాం, పెదపాలపేట, పెద్దసవలాపురం, పురుషోత్తపురం గ్రామాల్లో ఈ ఏడాది ప్రస్తుతం రబీలో 2,500 ఎకరాల్లో పంటలు వేశారు. ప్రస్తుతం నదిలో నీటిజాడలు కనిపించకపోవడంతో పంటలను ఎలా రక్షించుకోవాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 12 కిలోమీటర్ల పరిధి లో గల పరివాహక ప్రాంతంలోని రైతులు మెట్టభూముల్లో ఆకుకూరలు, కూరగాయలు, అపరాలు, వాణిజ్య పంటలు సాగుచేసి జీవనోపాధి పొందుతున్నారు.పరివాహక ప్రాంతం పరిధిలో గల గ్రామాలప్రజలు తాగునీటికోసం వంశధార నదిపైనే ఆధార పడుతున్నారు. అయితే ఈఏడాది మార్చి మొదటి వారం లోనే నదిలో చుక్కనీరు లేకపోవడంతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తీవ్ర నీటిఎద్దడి తప్పదని పరివాహక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


కొమనాపల్లి బ్రిడ్జి సమీపంలో ఎడారిని తలపిస్తున్న వంశధార నది


భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం



పాత సమితి భవనంలో వెలుగు కార్యాలయం నిర్వహిస్తున్న దృశ్యం

శిలాఫలకం వేశారు.. నిర్మాణం మరిచారు

● సొంత భవనానికి నోచుకోని వైనం ● ఇదీ గార వెలుగు కార్యాలయం పరిస్థితి

గార, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గారలోని వెలుగు కార్యాలయం సొంత భవనానికి నోచుకోవడంలేదు. మూడు దశాబ్దాలుగా పరాయి పంచన నడుస్తోంది. గతంలో శిలాఫలకం వేసి, భవనం నిర్మాణం పాలకులు మరిచిపోయారని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

గారలో 2017 సెప్టెంబరు 18న అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పూర్వసమితి కార్యాలయం పక్కన భారత్‌నిర్మాణ రాజీవ్ గాంధీ సేవా కేంద్ర భవనం పేరుతో రూ.25 లక్షలతో వెలుగు కార్యాలయం (స్త్రీశక్తి భవనం) నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. భవనం కింది భాగంలో వెలుగు కార్యాలయం మొదటి అంతస్తులో ఉపాధిపథకం కార్యాలయం నిర్వహణకు డిజైన్ చేశారు.అయితే ఈస్థలం తమశాఖ పరిధిలో ఉండడంతో నిర్మాణాలు చేపట్టరాదని కేంద్రపురావస్తుశాఖ అధికారులు పేర్కొనడంతో అప్పట్లో శిలాఫలకం స్థాయిలోనే నిలిచిపోయాయి. తర్వాత అధికారులు చాలాచోట్ల భవననిర్మాణానికి అవసరమైన స్థలం కోసం ప్రయత్నించారు. స్థలం అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణం గురించి మరిచిపోయారు.దీంతో ప్రస్తుతం పూర్వ సమితి కార్యాలయానికి చెందిన ఓ గదిలో వెలుగు కార్యాలయం నిర్వహిస్తున్నారు. మండలంలో 25 పంచాయతీల పరిధిలో 46 గ్రామ సంఘాలు, 2,275 ఎస్‌జీహెచ్‌లు, వీటి పరిధిలో 22,463 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆయా సంఘాల సభ్యులు, అధికారుల సమావేశాలు నిర్వహణకు పూర్తిస్థాయిలో వసతి చాలకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. ఉపాధి పథకం కార్యాలయాన్ని ఇటీవల నిర్మించిన కొత్త మండల పరిషత్ కార్యాలయం భవనంలోకి మార్చిన విషయం విదితమే. అయితేవెలుగు కార్యాలయానికి పూర్తి స్థాయిలో కొత్త భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు మహిళా సంఘ సభ్యులు అధికారులు కోరుతున్నారు.

ఫ్లైఓవర్ పనుల ప్రారంభం

● కొలతలు వేసి మార్కింగ్ ● రణస్థలం హైవేలో ఆక్రమణల తొలగింపు


వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ అవతారం

రణస్థలం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రణస్థలంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపనులు ఆదివారంప్రారంభించారు. ఉదయం ఆరు గంటలకే రెవెన్యూ, పంచాయతీరాజ్, హైవే అధికారులు పోలీస్‌బందోబస్తు మధ్య నాలుగుయంత్రాలతో జాతీయరహదారికి ఇరు వైపుల ఆక్రమణల తొలగింపునకు ఉపక్రమించారు.ఆకస్మాత్తుగా ఆక్రమణలు తొలగించడంతో వ్యాపారులు ఆందోళనచెందారు. కాలువ నుంచి ఎంతవరకు తొలగిస్తారన్న అంశంపై స్పష్టత ఇవ్వకుండా ఎలాతొలగిస్తారని వ్యాపారులు అధికారులను ప్రశ్నించారు.కొంతమంది వ్యాపారులు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఈశ్వరరావు అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు తొలగిస్తారో తెలియజేయాలని కోరారు.జాతీయరహదారి కాలువకు రెండు మీటర్ల పరిధిలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్నామని అధికారులు తెలియజేశారు. దీంతో కాలువ నుంచి రెండు మీటర్లు కొలతలువేసి మార్కింగ్ చేయడంతో వ్యాపారులు శాంతించారు. వ్యాపారుల అభ్యర్థన మేరకు కాలువకు రెండు మీటర్ల పరిధిలో ఉన్న కట్టడాలను వ్యాపారులు తొలగించుకొనే అవకాశం జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం కల్పించారు. రెండుకిలోమీటర్ల మేర ఫ్లైఓవర్ కొనసాగుతుందని, 800 మీటర్ల వరకూ ఓపెన్ ఫ్లైఓవర్ నిర్మిస్తామని, ఈ పనులు పూర్తయ్యేసరికి రెండేళ్లు పడుతుందని హైవే అధికారులు తెలిపారు. ఫుట్ పాత్ వ్యాపారులను తొలగించడంతో వందలాది కుటుంబాలు వీధిన పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో జంక్షన్ అంధకారంగా మారింది.డీఎస్పీ సీహెచ్ వివేకనంద తొలగింపుపనులను పర్యవేక్షించారు.కాగాకలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ హైవేలో ఆక్రమణల తొలగింపుపై సంబంధిత రెవెన్యూ అధికారులను ఎప్పటికప్పుడు సమాచారం అడిగి తెసుకున్నారు. తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఎస్ఐ ఎస్.చిరంజీవి, నేషనల్ హైవే అధికారి సతీస్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు జడ్పీలో పీజీఆర్ఎస్

శ్రీకాకుళం, మార్చి9(ఆంధ్రజ్యోతి): శ్రీకా కుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం పది గంటల నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆసుపత్రుల్లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

అరసవల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సెకండరీ హెల్త్ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ కళ్యాణబాబు ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన అభ్యర్థులు సోమవారం నుంచి ఈనెల 15వతేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.థియేటర్ అసిస్టెంట్, ఆడియోమెట్రీషియన్, ఎలక్ట్రీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్, ప్రింటర్‌పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వెబ్‌సైట్‌లోని శ్రీకాకుళం. ఏపీ.జీఓవి.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాల కోసం డీసీహెచ్ఎస్ కార్యాలయ నోటీసుబోర్డును సందర్శించవచ్చని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఏడాది కాలపరిమితి మాత్రమే ఉంటుందని, రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్ కోసం..

సోంపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో మూత్ర పిండాల వ్యాధి ప్రాజెక్ట్‌లో ల్యాబ్ టెక్నీషియన్లగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని జార్జి ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ఒక ప్రకటనలో తెలిపింది. ఏదైనా ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు ఉత్తీర్ణత కావడంతోపాటు ఉద్దానం ఆయా మండలాల్లో నివాసం ఉండాలని పేర్కొంది. ఆసక్తి గల వారు సీయూఆర్‌ఈసీకేడీయూ.సీవి జిమెయిల్.కమ్‌కు దరఖాస్తులు పంపించాలని లేదా నేరుగా కార్యాలయంలో అందజేయాలని తెలిపింది.


గార: వత్సవలస రాజమ్మ జాతరకు తరలివచ్చిన భక్తులు


అరసవల్లి: కలెక్టర్‌కు ఆదిత్యుని చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఇబ్బంది

భక్తిశ్రద్ధలతో వత్సవలసలో జాతర

గార, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న వత్సవలసలో రాజమ్మతల్లి జాతరసంబరాలు భక్తిశ్రద్ధలతో ఆదివారంనిర్వహించారు.ఉదయం భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి భూలోక్మ, రాజమ్మలను దర్శించిమొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు వాహనాల్లో రాగా.. కొందరు కాలినడకన వచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ పైడపు నాయుడు,ఎస్ఐ ఆర్.జనార్దన్ బందోబస్తు, మెరైన్ సీఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో గస్తీ నిర్వహించారు. కాగాశ్రీకూర్మం ఆలయంఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రాజమ్మతల్లి యాత్ర నుంచి తిరుగు ప్రయాణమయ్యే భక్తులు శ్రీకూర్మనాథుని దర్శించుకున్నారు. ఈవో గురునాథం ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేశారు.

సరుబుజ్జిలిలో నవగ్రహాల ప్రతిష్ఠ

సరుబుజ్జిలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉమారామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో మూడురోజులుగా నవగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పెద్ది సీతారాం దంపతులు నవగ్రహ మండపాన్ని నిర్మించగా సర్పంచ్ బొడ్డేపల్లి చాందిని హరిబాబు ఆధ్వర్యంలో పలువురు విగ్రహాలను ఏర్పాటు చేశారు. యాగశాలలో మావుడూరు లక్ష్మీనారాయణ భుక్త ఆధ్వర్యంలో వేద పండితులు హోమాలు, యజ్ఞాలు నిర్వహించారు.

వినాయక విగ్రహం..

కవిటి, మార్చి9 (ఆంధ్రజ్యోతి): కవిటిలోని చంద్రశేఖరాలయంలో నిర్మించిన మండపం, ఉపఆలయాలను ఆదివారం ప్రారంభించారు. ప్రశాంత్ పాడి, చంద్రశేఖర శతపతి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, వినాయకుడు, సుబ్రమణ్యా స్వామి విగ్రహాలను ఊరేగించి ప్రతిష్ఠించారు.కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బి.అశోక్, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాల్,జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయమ్మ, ఎమ్మెల్సీ ఎస్.రామారావు పాల్గొన్నారు.


కవిటి: పూజల్లో పాల్గొన్న విప్ అశోక్

గరుడవాహనం..

కవిటి బెజ్జిపుట్టుగలోని చక్రధరపెరుమాళ్ల స్వామి ఆలయంలో గరుడవాహన ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రగడపుట్టుగకు చెందిన పి.బలరాంమూర్తి తమిళనాడులోని కుంభకోణంలో తయారుచేయించి ఆలయానికి అందించారు. డోలోత్సవాల్లో భాగంగా పూజలను నిర్వహించి గరుడవాహన సేవను చేపట్టారు.

మఠంసరియాపల్లిలో సింధుపోలమ్మ సంబరం

కంచిలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మఠంసరియాపల్లిలో ఆదివారం సింధు పోలమ్మతల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో అమ్మవారి గజముద్దను ఊరేగించారు. కార్యక్రమంలో ఆటోయూనియన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కాళీమాత ఆలయ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డబ్బూరివీధి జంక్షన్‌లో గల దక్షిణకాళీమాత మందిరం, పంచముఖ ఆంజనేయ ఆలయం వార్షికో త్సవం ఆదివారం నిర్వహించారు.ఉదయం ఆలయంలో ప్రత్యేకపూజలు, సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

గార, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమ్మపేటలో ఆదివారం రాత్రి ఉమారామలింగేశ్వర స్వామివారి వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించారు.రాత్రి మేళతాళాలతో తిరువీధిఉత్సవం చేపట్టారు.అనంతరం అర్చకులు దార్లపూడి కామేశ్వరశర్మ శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించారు.

ఆదిత్యునికి కలెక్టర్ పూజలు

అరసవల్లి,మార్చి 9(ఆంధ్రజ్యోతి):అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి వారిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆదిత్య ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనక రాజుస్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రంజిత్‌శర్మ పాల్గొన్నారు.

జిల్లా వైద్యఆరోగ్యశాఖపై విజి'లెన్స్'!

(ఐదో పేజీ తరువాయి)

విజిలెన్స్ కార్యాలయంలో ఈ నెల 11 నుంచి విచారణ నిర్వహిస్తాం.ఆనాటి నుంచి రోజులవారీగాఒక్కొక్కరు సంబంధిత ఫైల్స్‌ను, ఇతర వివరాలను వెంటబెట్టుకుని హాజరుకావాలి' అని చెబుతూ.. ఆయా సిబ్బంది పేర్లను నోటీసులో పొందుపరిచి డీఎంహెచ్‌వో కార్యాలయానికి లేఖ పంపించారు. దీంతో ఉద్యోగులు, సిబ్బందిలో కలకలం రేగింది. ఈనెల 11 నుంచి విచారణ నిర్వహించనుండ టం..గతంలో జరిగిన నియమాకాల ప్రక్రియ.. ఇతరత్రా వివరా లను వెల్లడించే విషయమై సిబ్బంది గందరగోళానికి గురవుతున్న ట్లు సమాచారం. వైసీపీ హయాంలో రాజ్యాంగబద్ధమైన పదవి వెలగబెట్టిన వ్యక్తికూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసి..ఆ తర్వా త చల్లబడిపోయారు. ఇప్పుడు తాజాగా.. ఉద్యోగుల పేరుతో ఫిర్యాదుపై విచారణ చేపట్టనుండడం చర్చనీయాంశమైంది.

యంత్రాలు వస్తున్నాయ్..

(ఐదో పేజీ తరువాయి)

బ్రెష్‌కట్టర్, మల్టీక్రాఫ్ ప్లాంటర్, డైరెక్ట్ సీడర్, రోటావేటర్ ఇలా 137 రకాల మోడల్స్‌లో రైతులకు అందించేందుకు వ్యవసాయశాఖ సంబంధిత ఏజెన్సీలను సిద్ధం చేస్తోంది. ఈ విషయమై జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.త్రినాథస్వామి వద్ద ప్రస్తావించగా జిల్లాలో 1,903 యాంత్రీకరణ పరికరాలు రైతులకు మంజూరయ్యాయని తెలిపారు. సోమవారం గ్రామీణ వ్యవసాయ సహాయకులకు సైతం దీనిపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా రైతులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఆరుగురి పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్, మార్చి9(ఆంధ్రజ్యోతి):రూరల్ మండలంలోని చింతాడ సంతలో ఆదివారం రాత్రి ఆరుగురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 11,800 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసినట్లు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు.

అరుదైన గౌరవం



- ప్రతిభాభారతి కుమార్తెకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం
- నేడు నామినేషన్ దాఖలు చేయనున్న గ్రీష్మ

రాజాం, మార్చి9(ఆంధ్రజ్యోతి): టీడీపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా కావలి గ్రీష్మప్రసాద్ నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు అధినేత చంద్రబాబు ఆమె పేరును ఖరారు చేశారు. అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేశాక ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమవారంతో నామినేషన్ గడువు ముగియనుండడంతో పోటీకి ఎంపికైన అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను కొద్ది గంటల్లో దాఖలు చేయనున్నారు. ఎమ్మెల్యేల కోటా కింద ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 20న ఎన్నికలు జరగనున్నాయి. ఒక స్థానం జనసేనకు, ఇంకొకటి బీజేపీకి కేటాయించారు. ఈ నేపథ్యంలో టీడీపీ నుంచి బీటీ నాయుడు, బీద రవిచంద్ర, గ్రీష్మ ప్రసాద్ పేర్లను ఖరారు చేశారు. గ్రీష్మ మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి కుమార్తె. టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రతిభాభారతి పార్టీలో కొనసాగుతున్నారు. 1983లో తొలిసారిగా ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా గెలు పొందగా ఎన్టీఆర్ తన క్యాబినెట్‌లోకి ఆమెను తీసుకు న్నారు. అది మొదలు ఆమెకు టీడీపీ ప్రభుత్వం వచ్చిన ప్రతిసారీ మంత్రి పదవి దక్కుతూనే ఉంది. ఎచ్చెర్ల నియోజక వర్గం నుంచి వరుసగా ఐదు సార్లు గెలిచారు. 1999లో ఆమెను శాసనసభ స్పీకర్‌గా ఎంపిక చేశారు. ఒకానొక దశలో అర్ధరాత్రి 12 గంటల వరకు శాసనసభ నడిపిన చరిత్ర ఆమెది. అయితే 2004లో ఆమెకు ఓటమి ఎదురైంది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో ప్రతిభా భారతి రాజాం నియోజక వర్గానికి మారారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన ఆమెకు అక్కడ కూడా ఓటమి ఎదురైంది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రతిభాభారతికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించారు. కాగా 2024 ఎన్నికల్లో రాజాం అసెంబ్లీ నియోజకవర్గం టికెట్‌ను గ్రీష్మప్రసాద్ ఆశించారు. అయితే ప్రత్యేక పరిస్థితుల్లో చంద్రబాబు కోండ్రు మురళీ మోహన్‌కు టికెట్ ఇచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్సీగా గౌరవించాలని నిర్ణయించుకుని టిక్కెట్ కేటాయించారు.

క్రైం కార్నర్

దొంగ-పోలీస్ ఆట ఆడుతూ..

- నేలబావిలో పడి బాలుడి మృతి



దీపక్ మృతదేహం

టెక్కలి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ గోపినాథపురం సమీపంలో నేలబావి వద్ద ఆదివారం తోటి స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లి దొంగ-పోలీస్ ఆట ఆడుతూ నీటిలో పడి ఊపిరి ఆడక బెండి దీపక్ (15) మృతి చెందాడు. దీపక్ ఎప్పటికీ బావిలో నుంచి బయటకు రాకపో వడంతో తోటి స్నేహితులంతా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. బావిలోకి చూడగా అప్పటికే మృత్యు వాతపడ్డారు. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారంతా వచ్చి దీపక్‌ను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే దీపక్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

60 కేజీల గంజాయి స్వాధీనం

నరసన్నపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మడపాం వద్ద జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జిల్లా పోలీసు టాస్క్‌ఫోర్స్ బృందం గంజాయిని స్వాధీనం చేసుకుంది. బరంపురం నుంచి హైదరాబాద్‌కు బస్సులో సూట్ కేసుల్లో తరలిస్తున్న గంజాయి రవాణాని అడ్డుకున్నారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో మడపాం టోల్ ప్లాజా వద్ద ఒడిశా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ట్రావెల్ బస్సులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మూడు సూట్ కేసుల్లో ఉన్న సుమారు 60 కేజీలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలను సోమవారం వెల్లడించడం జరుగుతుందని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని ఎక్కడకు తరలిస్తున్న విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు.

సముద్రంలో యువకుడి గల్లంతు

- నలుగురిని రక్షించిన మెరైన్ పోలీసులు
- వత్సవలస రాజమ్మ యాత్రలో అపశ్రుతి



అలల తాకిడికి గురైన వారిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకు వస్తున్న మెరైన్ పోలీసులు



కొడమటి అశోక్ (ఫైల్)

గార, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న వత్సవలసలో రాజమ్మ సంబరాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. జి.సిగడాం మండలంలోని దేవర వలసకు చెందిన కొడమటి అశోక్ (23) సముద్ర స్నానాలు చేస్తుండగా గల్లంతయ్యాడు. అక్కడే స్నానం చేస్తూ మునిగిపోతున్న మరో నలుగురిని మెరైన్ పోలీ సులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. స్థానికులు, కళింగపట్నం మెరైన్ పోలీసుల కథ నం మేరకు.. దేవర వలసకు చెందిన కొడమటి ఈశ్వరరావు, అశోక్, చీపురుపల్లి మండలంలోని కాపుసంభాం గ్రామానికి చెందిన చందక వంశీ, పిన్నింటు జయలక్ష్మి, పిన్నింటి దిలీప్ ఆదివారం మధ్యాహ్నం సముద్ర స్నానాలు చేస్తున్నారు. ఆ సమయంలో అలలు తాకిడికి వారంతా ఉక్కిరిబిక్కిరయ్యారు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న మెరైన్ పోలీసులు, మెరైన్ ఎస్ఐ హరికృష్ణతో పాటు సిబ్బంది హుటాహుటిన సముద్రంలో దిగి అలల తాకిడికి మునిగి పోతున్న వారిని రక్షించేందుకు చర్యలు చేపట్టారు. వీరిలో నలుగుర్ని రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చి సపర్యలు చేశారు. గల్లంతైన అశోక్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. అశోక్ గల్లంతు కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సంఘటన స్థలానికి ఎస్ఐ ఆర్.జనార్దనరావు, చేరుకొని వివరాలు సేకరించారు. అశోక్ సముద్ర స్నానాలు చేస్తూ గల్లంతైనట్లు తండ్రి ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జనార్దనరావు తెలిపారు.

ద్విచక్ర వాహనానికి నిప్పంటించిన దుండగులు

వజ్రపుకొత్తూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శివసాగర్ తీరంలో ఉన్న ద్విచక్ర వాహనాన్ని శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. శనివారం సాయంత్రం నుండే వాహనం ఈ ప్రాంతంలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చినట్లు తెలుసుకున్న ఎస్ఐ నిహార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ వాహనం కొత్తూరు మండలానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించి అతనితో మాట్లాడారు. కొద్దిరోజుల కిందట షోరూంకి ఇచ్చి కొత్త వాహనం తీసుకున్నట్లు చెప్పాడని ఎస్ఐ తెలిపారు. అయితే ఎవరు ఈ బైక్‌ని తీసుకువచ్చి బీచ్‌లో విడిచిపెట్టారన్న విషయమై ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు.

27 మద్యం సీసాల స్వాధీనం

ఇచ్ఛాపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ పరిధిలో ఈనెల ఒకటి నుంచి తొమ్మిదో తేదీ వరకు చేసిన దాడుల్లో 4కేసులు నమోదు చేసి నలుగురుని అరెస్ట్ చేశామని సీఐ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఒడిశాకు చెందిన 12 బీర్లు, డ్యూటీ ఫెయిడ్ లిక్కర్ 27 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సామాన్యుడికి కూటమి ప్రభుత్వం భరోసా

పాతపట్నం/కొత్తూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సామాన్యునికి కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో కొత్తూరు మండల గూనభద్ర ఆర్ఆర్ కాలనీకి చెందిన ఇనుముల మురళి కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.1,86,805 చెక్కును ఆదివారం అందజేశారు.

విద్యార్థుల్లో ఆరోగ్యకర పోటీ ఉండాలి

పాతపట్నం మార్చి9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆరోగ్యకర పోటీ ఉండాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పెద్దసీది జడ్పీ హైస్కూల్‌లో ఆజాద్ వెల్ఫేర్ అసోసి యేషన్, మదర్ థెరిసా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మెళియాపుట్టి మాజీ ఎంపీపీ సలాన మోహనరావు, సన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ పెద్దిన మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కొత్తూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కళాశాలలో 1970-71 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులంతా ఒకచోట కలుసుకుని ఆనందం పొందారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలు, నేటి యోగక్షేమాలను ఒకరికొకరు తెలుసుకుని శుభాకాంక్షలు చెప్పుకుని ఆనందం వ్యక్తంచేశారు. అనంతరం నాటి గురువులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి చర్యలు

టెక్కలి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆ పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్రచక్రవర్తి, పార్టీ మండల అధ్యక్షుడు జర్జాన రామ్‌జీ అన్నారు. ఆదివారం పెద్దసాన, లింగాలవలస పంచాయతీ సొర్లిగాం ప్రాంతాల్లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అనే విషయమై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జన్ని పరమేశ్వరరావు, కో-కన్వీనర్ నడుపూరు లక్ష్మీనారాయణ, సంపతిరావు రమేష్ పాల్గొన్నారు.

రామాయణం యువతరానికి ఆదర్శం

పోలాకి, మార్చి9(ఆంధ్రజ్యోతి): రామాయణ, భారత గ్రంథాలు నేటి యువతరానికి ఆదర్శమని లయిదాం శివానందక్షేత్ర ప్రవచకుడు యాలాల శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం దండులక్ష్మీపురం పంచాయతీ చింతాడపేట రామయోగి సేవాశ్రమంలో సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. శ్రీరాముడి ధర్మనిరతిని యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి ధర్మజీవనం సాగించాలన్నారు. పంతాలకు, పట్టింపులకు పోయి తనువు చాలించవద్దని యువతకు హితవు పలికారు. కార్యక్ర మంలో సేవాశ్రమ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథ, బి.లక్ష్మణరావు, గోపాలస్వామి, అనంతరావు, గోవిందరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులే అతిథులు



పూర్వ విద్యార్థులైన అతిథులను సత్కరిస్తున్న దృశ్యం

పోలాకి, మార్చి9(ఆంధ్రజ్యోతి): మా పాఠశాలలో చదివి ఉన్నత ఉద్యోగాలు పొందిన అనేక రంగాల్లో ఉండడం ఆనందంగా ఉందని, వారే వార్షికోత్సవానికి ముఖ్య అతిథులని విశ్వశాంతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ మెట్ట జనార్దన్, కొండమ్మ అన్నారు. ఆదివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యా ర్థులు పైల రమణ న్యూరాలజిస్ట్‌గా, కిల్లి సతీష్ కార్డియాలజిస్ట్‌గా, కోట బాలసూర్యప్రకాష్ ఉన్నత వైద్యులుగా ఉంటూ వైద్య సేవలు అందించడం ఆనందదాయక మన్నారు. ఈ సందర్భంగా వైద్యులు పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారిని యాజమాన్య ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

'పది' పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



వంటలను పరిశీలిస్తున్న డీడీ విశ్వమోహనరెడ్డి

జలుమూరు (సారవకోట), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యా ర్థులు శతశాతం ఉత్తీర్ణ సాధించాలని, ఈ దిశలో తర్ఫీదు ఇవ్వాలని సాంఘిక సంక్షేమశాఖ డీడీ విశ్వమోహనరెడ్డి అన్నారు. స్థానిక బాలుర వసతి గృహాన్ని ఆదివారం సందర్శించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రతతో పాటు వంటగది, వంటపాత్రలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వసతి గృహ ఆవరణ లో సాగుచేస్తున్న కూరగాయలు పంటలను పరిశీలించారు. ఏవో సమీల్‌కుమార్, సంక్షేమాధికారి డి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి



కండువాలు వేసి ఆహ్వానిస్తున్న తేజేశ్వరరావు

హరిపురం, మార్చి9 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. మందస వాసు దేవ ఆలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో పార్టీ అధ్యక్షుడు తెలుకుల సురేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన 15మందికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జోనల్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రౌతు చిరంజీవిరావు, సాయి, హడ్డీ, వెంకర్రావు, జాదవ్, బమ్మిడి అప్పన్న పాల్గొన్నారు.

ఘనంగా వల్లభనారాయణుడికి అభిషేకాలు

హరిపురం, మార్చి9 (ఆంధ్రజ్యోతి): రట్టి డోలోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు నీలకంఠం, సీతారాం, ప్రహ్లాద్ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని పలాస నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వెంకన్నచౌదరి దర్శిం చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బావన దుర్యోధన, జీకే నాయుడు, బమ్మిడి కర్రయ్య, మండల లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సిక్కోలు వీరగాథ అజరామరం

పలాసరూరల్,మార్చి9(ఆంధ్రజ్యోతి): సిక్కోలు వీరగాథ అజరామరమని, ప్రతీ ఒక్కరూ దీనిని గురించి తెలుసుకోవాలని అండమాన్ తెలుగు సమాజ సభ్యులు అన్నారు. కుత్తుమ వినోద్ రచించిన సిక్కోలు వీరగాథ పుస్తక పరిచయ సభ నికోబార్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో అండమాన్ తెలుగుసమాజ సభ్యులు తిమ్మల సుందర్రావు, తాల వాసు, హరిక్రిష్ణ, కుత్తుమ ధర్మారావు, కోయిల రవి తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల అభివృద్ధికి చర్యలు

- పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి

పలాస, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో ప్రతి గ్రామం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడచిన ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పలాస-కాశీబుగ్గలో రైల్వే ఫ్లైఓవర్‌కి ఊహించని విధంగా కేంద్ర ప్రభుత్వం రూ.49 కోట్లకు పైగా నిధులు ఇచ్చిందని, త్వరలోనే పనులు జరుగుతా యన్నారు. కాశీబుగ్గ- అక్కుపల్లి- బెండి రహదారికి త్వరలో మోక్షం లభించనుందన్నారు. రానున్న రోజుల్లో అంతర్గత రహదారులు, పెండింగ్‌లో ఉన్న పనులు చేపడతామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు రూ.30 కోట్లు, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.90 కోట్లు రికార్డు స్థాయిలో మంజూరయ్యా యన్నారు. పనులు వేగవంతానికి అధికారులతో ఇప్పటికే చర్చించడం జరిగిందని, ఆఫ్‌షోర్ పూర్తయితే రెండు పంటలకు సరిపడా సాగు నీరందే అవకాశం ఉందన్నారు. కాశీబుగ్గలో కేంద్రీయ విద్యాలయం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం, జీడి పరిశోధన కేంద్రాల నిర్మాణం ప్రతిపాదనలో ఉందన్నారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్ రావు, లొడగల కామేశ్వర రావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్య నారాయణ, దువ్వాడ శ్రీకాంత్, ఎం.నరేంద్ర , మల్లా శ్రీనివాస్, శాసనపురి మురళీకృష్ణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్‌గుప్తా, ఎ.రామకృష్ణ, జోగ మల్లి, కొత్త సత్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పలాస ఇన్‌చార్జి వెంకన్నచౌదరి

కనుల పండువగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ



యాగశాలలో పూజలు చేస్తున్న భక్తులు

నందిగాం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురంలో రెయ్యి బోడమ్మ, భూలోకమాత అమ్మవార్ల ఆలయ ప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం కనుల పండువగా జరిగింది. వేదపండితుల వేదమంత్రాలు, మేళతాళాల మధ్య వేలాది మంది భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. గ్రామపురోహితులు సత్య నారాయణ శర్మ, టెక్కలికి చెందిన వేదపండితుడు బంకుపల్లి సంతోష్‌శర్మ, ఇతర రుత్వి కుల పర్యవేక్షణలో విశేషపూజలు చేసి విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ చేపట్టారు. హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర నాట్య అకాడమీ చిన్నగురు స్వామి బృందం కూచిపూడి, భరత నాట్యం ప్రదర్శనలు, మహతీ కళాక్షేత్రం, టి.బరంపురం వారిచే సంగీత నాద నీరాజనం విశేషంగా ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు, కూటమి నాయకులు, వైసీపీ నాయకులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు.

నౌగాంలో పునఃప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

నందిగాం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నౌగాంలో గౌరీశంకరస్వామి ఆలయ పునః ప్రారం భం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహ వచనం, పంచగవ్యప్రాసన, ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు తదితర కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠతో పాటు అన్న ప్రసాద వితరణ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు.

చిన్నకొల్లివలసలో..

ఎల్.ఎన్.పేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చిన్న కొల్లివలస ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో కోదండ రామాలయ ప్రారంభం విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పురోహితుడు భాస్కరభట్ల వరప్రసాదశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అలాగే రామనామ మూలమంత్ర జపాలను చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

శ్రీముఖలింగానికి భక్తుల తాకిడి

జలుమూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరస్వామి దర్శనార్థం ఆది వారం భక్తులు పోటెత్తారు. ఫాల్గుణ శుద్ధ దశమి సందర్భంగా స్వామిని దర్శించుకోడానికి పరిసర గ్రామాలకు చెందిన భక్తులే కాకుండా జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో పి.ప్రభాకరరావు ఏర్పాట్లు చేశారు.

ఎల్లమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు




కొత్తూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నివగాం శిర్లపోతన్న ఎల్లమాంబ ఆల యాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచనలిచ్చారు.

సమస్యలపై నిలదీత

ఎల్.ఎన్.పేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి అధ్యతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తంచేస్తూ సంబంధిత అధికారులను నిలదీశారు. సమస్యలపై స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా దాటవేత ధోరణితో వ్యవహరించిన అధికారుల తీరును ఎండ గట్టారు. సమావేశంలో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, జడ్పీటీసీ కె.త్రినాథులు, తహసీల్దార్ ఈశ్వరమ్మ, మండల ఉపాధ్యక్షులు ఎస్.ఇంద మ్మ, టి.కుమారి పాల్గొన్నారు.

వైభవ్ జ్యూయలర్స్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ పలాస సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి

పలాస, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ కేటీ రోడ్డు ఆర్కె పోలీసుకాలనీ వద్ద ప్రముఖ జ్యూయలర్స్ సంస్థ వైభవ్ 19 శాఖను ఆదివారం ప్రారంభించింది. టీడీపీ పలాస సమన్వయ కర్త, గ్లో సంస్థ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ వెంకన్నచౌదరి రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వ లన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దినదినాభివృద్ధి చెందు తున్న పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో వైభవ్ వంటి సంస్థను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో జిల్లా కేంద్రం గా పలాస మారబోతోంది, అంతర్జాతీయ ఎయిర్ పోర్టు కూడా వస్తున్న తరుణంగా భారీ బంగారం దుకాణాలు రావడం పట్టణ ప్రజల అదృ ష్టంగా భావిస్తున్నామన్నారు. వైభవ్ సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జె.రఘునాథ్ మాట్లాడుతూ.. 916 హాల్ మార్క్ బంగారు ఆభరణాలు, సర్టిఫైడ్ డైమండ్స్, సాధారణ వెండి వస్తువులు, వివాహ ఆభరణాలు అందించాలనే ఉద్దేశంతో 19వ షోరూమ్ ప్రారంభించామన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ప్రతీ రూ.9999 కొనుగోలుపై కూపన్ పొంది, డ్రాలో 2 హోం డా ఏక్టివాలు గెలుచుకునే అవకాశాన్ని విని యోగించుకోవాలని కోరారు. సీఎండీ భారత రత్నకుమారి, హోల్ టైమ్ డైరెక్టర్ గ్రంధి కీర్తన, సీఓఓ గొంట్ల రాఖాల్, ఈడీ సిందూరి వెంకటేష్ మాట్లాడుతూ తమ సంస్థకు జంట పట్టణ ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ జీడి వ్యాపారుల సంఘం సభ్యుడు మల్లా కాంతారావు, ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు, వ్యాపారవేత్త మల్లా కృష్ణారావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, ఎం.నరేంద్ర, సప్ప నవీన్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

పలాస, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎన్.రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి పునరుద్ధరిస్తున్నామన్నారు. ప్రజలు సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సంఘ బలోపేతానికి కృషి

నరసన్నపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శిష్టకరణాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సంఘ బలోపేతానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు సదాశివుని రాంబాబు అన్నారు. ఆదివారం సంఘ భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. శిష్టకరణాలను ఓబీసీలో చేర్చేవరకు కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సదాశివుని కృష్ణ, కస్పా ప్రసాదరావు, ఎంవీజే మోహనరావు, రఘుపాత్రుని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మందిరానికి రూ.లక్ష విరాళం

హిరమండలం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): హిరమండలంలో సత్యసాయిబాబా మందిర నిర్మాణానికి గ్రామానికి చెందిన మోణింగి మల్లికార్జునరావు రూ.1.11 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని సమితి కార్యదర్శి అందవరం బుచ్చిఅబ్బాయికి ఆదివారం అందజేశారు.

గిరిజన పూజారులను ఆదుకోవాలి

హరిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు వ్యవహారాల్లో కొండ దేవతలు, దేవతామూర్తుల ఆలయాల్లో పూజారులైన బుయా, పొడాలను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు గిరిజన సంఘ నేతలు కోరారు. ఈ సందర్భంగా ఏటీడీబ్యూవో కార్యాలయ అధికారులకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. గిరిజన ఆచారాల ప్రకారం కొండదేవతలకు మొక్కులు తీర్చుకుంటూ పూజలు చేస్తూ జీవ నం గడుపుతున్నారని, వారికి వేతనాలు, పింఛన్లు అందించాలన్నారు. కార్యక్రమం లో గిరిజన సంస్కృతి రక్షణ్ దళ్ అధ్యక్షుడు వెంకటరావు, నందు, రామారావు, మాధవ రావు, ఢిల్లీరావు పాల్గొన్నారు.

ఉద్దానం సేవాసమితి సేవలు భేష్

హరిపురం, మార్చి9 (ఆంధ్రజ్యోతి): సిక్కోలు ఉద్దానం సేవాసమితి నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం సమితి అధ్యక్ష, కార్యదర్శులు తారక్, తిరుపతిరావు మందస మండలంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వచ్ఛందంగా అంబులెన్స్ ద్వారా సేవ బాగుందని, ఒక ఫ్రీజర్‌ను అందిస్తానన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

కోటబొమ్మాళి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో హిందువులపై ముస్లింలు దాడి చేసిన ఘటనకు నిరసనగా సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 4న రాయచూరులో వీరభద్ర స్వామి ఆలయం పార్వేటి ఉత్సవంలో ఊరేగింపు నిర్వహిస్తుండగా ముస్లింలు దాడి చేయడం దారుణమన్నారు. వారిని పోలీసులు అదుపు చేయడంలో విఫలమవడమే కాకుండా పక్షపాత ధోరణితో హిందువులపైనే లాఠీచార్జి చేసి గాయపరిచారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో చేస్తున్న ధర్నాలో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు.

రాయ్‌పూర్‌లో జానపదుల సందడి

పలాసరూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో జరుగుతున్న ద్వితీయ తెలుగు మహాసభల్లో పలాస ప్రాంతానికి చెందిన కళాకారుల బృందం ఆదివారం ఉత్తరాంధ్ర జానపదాలను ఆలపించారు.